సంక్షేమ సారథికి అండగా నిలవండి


చెంగల్రాయమిట్ట డివిజన్‌లో పర్యటిస్తున్న విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: ప్రజల అభ్యున్నతి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సంక్షేమ సారథి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి కోరారు. ఆయన శనివారం స్థానిక చెంగల్రాయమిట్ట డివిజన్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆయనకు కార్పొరేటర్ హరిణిరెడ్డి, నాయకులు మురళీరెడ్డి ఆధ్వర్యంలో గజమాలతో స్వాగతం పలికారు. జేసీబీలతో పువ్వుల వర్షం కురిపించారు. ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి వారు పొందిన ప్రభుత్వ పథకాలు, లబ్ధిని వివరించారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ మనమందరం బాగుండాలంటే రానున్న ఎన్నికల్లో అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. జగనన్న మళ్లీ సీఎంగా చేసుకుంటే ప్రజలకు మరింత సంక్షేమం అందుతుందన్నారు. చిత్తూరు జిల్లా కేంద్రమైనా గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా అన్ని రంగాల్లోనూ వెనుకపడిందన్నారు. జగనన్న పాలనలో మన ఊరు అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళా నాయకురాలు గాయత్రీదేవి మాట్లాడుతూ జనం బాగుండాలంటే జగనన్న సీఎంగా ఉండాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందన్నారు. కార్యక్రమంలో మేయర్ అముద, నాయకులు రెడ్డిశేఖర్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, శివ, రమాకాంత్, చిన్నా, రాజా, స్టోర్ చిన్నా, జానీ, రఘు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపులో యువత పాత్ర కీలకం

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ గెలుపులో యువత పాత్ర కీలకమని ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. ఆయన శనివారం చిత్తూరులో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ యువజన విభాగం ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ యువతతోపాటు పార్టీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానన్నారు. గత ఎన్నికల సమయంలో నిరుద్యోగ భృతి అని చంద్రబాబు యువతను మోసం చేశాడన్నారు. డ్వాక్రా మహిళలు, రైతన్నలకు రుణమాఫీ చేస్తానని తప్పుడు హామీలు ఇచ్చిన విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. జగనన్న అధికారంలోకి వచ్చాక రూ.2.55 లక్షల కోట్లను ప్రజాసంక్షేమానికి ఖర్చు చేశారని వివరించారు. పాలన పరంగా పలు సంస్కరణలు తీసుకొచ్చారని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మిస్తున్నారని, విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు. ఈ ప్రభుత్వంలో మేలు జరిగి ఉంటేనే మద్దతుగా నిలవాలన్నారు. యువత జిల్లా అధ్యక్షుడు హేమంత్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికలు మాటపై నిలబడే జగన్‌కి, అవినీతిని నమ్ముకున్న చంద్రబాబుకు మధ్య జరుగుతున్నాయని పేర్కొన్నారు. టీడీపీకి ప్రజల్లో విశ్వాసం ఉంటే ఎవరితోనూ పొత్తులు లేకుండా ఎందుకు పోటీ చేయలేకపోతోందని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు జ్ఞానజగదీష్, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మురళీ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చక్రి, కార్యదర్శులు రూపేష్ రెడ్డి, మురళీ నాయకర్, జయచంద్ర, నాయకులు శశిదీప్ రెడ్డి, మనోజ్ రెడ్డి, స్టాండ్లీ, సీలంబర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విజయానందరెడ్డి


గుడిపాల: ఇంటింటా ప్రచారం చేస్తున్న విజయానందరెడ్డి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి

గుడిపాల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. ఆయన శనివారం పేయనపల్లె పంచాయతీలో ఇంటింటా ప్రచారం చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారు పొందిన సంక్షేమ పథకాలు, లబ్ధిని వివరించారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా సంక్షేమం, అభివృద్ధి పనులను సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించారని పేర్కొన్నారు. ఎన్నికల హామీలను 99 శాతం అమలుచేసి పేదల ఆర్థిక స్థితిగతులను మార్చేసిన ఘనత జగనన్నకు దక్కుతుందన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎంను మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు జనార్దన్, ఎంపీటీసీలు గోళ్ల హరిప్రసాద్, యోవాన్, రవి, మొగిలిరెడ్డి, చిట్టిబాబు, సాల్‌మాన్, సర్పంచులు రజినీకాంత్, మధుసూదన్‌రెడ్డి, సుధాకర్‌నాయుడు, నాయకులు శిలంబరసన్, సాయి, రమణ, గుండుసాయి, కారిమేఘన్, దీన, లడ్డురెడ్డి, చిన్నతంబి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పూతలపట్టు తహసీల్దార్‌గా సుబ్రమణ్యంరెడ్డి



పూతలపట్టు: మండల తహసీల్దార్‌గా ఎం.వి సుబ్రమణ్యం రెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన అన్నమయ్య జిల్లా రాజంపేట నుంచి బదిలీపై పుంగనూరుకు వచ్చారు. పుంగనూరు, రాజంపేట రెండూ ఒకే పార్లమెంట్ పరిధిలోకి రావడంతో శనివారం ఆయనను పూతలపట్టుకు బదిలీ చేస్తున్నట్లు జిల్లా ఉత్తర్వులు జారీచేశారు. ఈ నేపథ్యంలో ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న శివరాముడు పుంగనూరు తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యంరెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి కృషి చేస్తానని తెలిపారు.

సకాలంలో టెస్టులు చేయాలి

చిత్తూరు రూరల్: ల్యాబ్‌లో టెస్టులను సకాలంలో చేయాలని, ఫిర్యాదులొస్తే ఊరుకోమని జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్ హెచ్చరించారు. ఆయన శనివారం చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గల్ల పరీక్షల నివేదికలను ప్రతి వారమూ కార్యాలయానికి అందజేయాలన్నారు. క్షయగా నిర్ధారిస్తే వారికి ఆరోగ్య సేవలు అందించాలన్నారు. క్రమం తప్పకుండా మందులు, మాత్రలు వాడేలా చూడాలన్నారు. అనంతరం సీజనల్ వ్యాధులపై వివరించారు. సమావేశంలో జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

విజయానందరెడ్డిని కలిసిన కృపాలక్ష్మి


కృపాలక్ష్మిని సన్మానిస్తున్న విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ గంగాధరనెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి శనివారం చిత్తూరు నియోజకవర్గ సమన్వకర్త విజయానందరెడ్డిని కలిశారు. చిత్తూరులోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. ఆమెను విజయానందరెడ్డి సన్మానించి ఆశీర్వదించారు. కృపాలక్ష్మి మాట్లాడుతూ సోదరుడు విజయానందరెడ్డిని కలవడం ఆనందంగా ఉందని, పలు విషయాలపై మాట్లాడినట్లు పేర్కొన్నారు.

జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా శివశంకర్


శివశంకర్‌ను సన్మానిస్తున్న జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు

కాణిపాకం: చిత్తూరు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా కాణిపాకంకు చెందిన శివశంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హిందూపూర్‌లో శనివారం రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఇందులో చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా కాణిపాకంకు చెందిన శివశంకర్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెంకటసత్యనారాయణ, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జయంతీ వెంకటేశులు, రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కలవల రామ్‌కుమార్‌కు శివశంకర్ కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను పలువురు జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు.

పటిష్టంగా పారిశుద్ధ్య పనులు


పనులను పరిశీలిస్తున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్: నగరంలో పారిశుద్ధ్య పనులు మరింత పటిష్టంగా చేపట్టాలని మేయర్ ఎస్.అముద అధికారులను ఆదేశించారు. ఆమె శనివారం 5వ వార్డులోని విజయనగర్, మురుగానపల్లి రోడ్డు, కామేశ్వర్ నగర్‌లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వీధుల్లో ఎక్కడా వ్యర్థాలు కనిపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మురుగు కాలువల్లో ఎప్పటికప్పుడు పూడిక తొలగించాలని, దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. క్లాప్ ఆటోల ద్వారా జరుగుతున్న చెత్త సేకరణను పరిశీలించారు. పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రజారోగ్యశాఖ అధికారి లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరసింహ పాల్గొన్నారు.

4, 5 తేదీల్లో అధికారులకు శిక్షణ

గంగాధర నెల్లూరు: చిత్తూరు జెడ్పీ సమావేశపు హాలులో 4, 5 తేదీల్లో అధికారులకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇవ్వనున్నట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివ ఆదేశించారు. ఆయన శనివారం మాట్లాడుతూ సోమవారం ఉదయం 10 గంటలకు సెక్టోరల్ అధికారులకు ఈవీఎంల వినియోగం, మంగళవారం ఉదయం 11 గంటలకు ఈఎస్ఎంఎస్‌పై ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీమ్ సభ్యులు, చెక్ పోస్ట్ సిబ్బంది, సబ్ సిబ్బందికి ఎన్నికల విధులు, బాధ్యతలపై శిక్షణ ఉంటుందని చెప్పారు.

విశ్రాంత పోలీసులకు ఎస్పీ సన్మానం


ఉద్యోగ విరమణ చేసిన పోలీసులను సన్మానిస్తున్న ఎస్పీ జాషువా

చిత్తూరు అర్బన్: చిత్తూరు పోలీసు శాఖలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఏఎస్ఐ ఆరుముగం, ఏఆర్ఎస్ఐ సెల్వరాజ్‌ను శనివారం ఎస్పీ జాషువా ఘనంగా సన్మానించారు. చిత్తూరు పోలీసు అతిథి గృహంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ కాలం క్రమశిక్షణతో పోలీసుశాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ చేయడం అభినందనీయమన్నారు. రిటైర్ అయిన అధికారులకు దుశ్శాలువలు కప్పి, జ్ఞాపికలు అందచేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆరీఫుల్లా, డీఎస్పీలు సుధాకర్‌రెడ్డి, మహబూబ్‌బాష, ఇలియాజ్‌బాష, పోలీసు సంఘం అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సెకండియర్ పరీక్షలు


పరీక్షా కేంద్రం వద్ద ఎస్ఐ శ్రీనివాసరావు

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఎస్ఐ శ్రీనివాసరావు పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటుచేశారు.

వినాయకుని దర్శించుకున్న జెడ్పీ చైర్మన్


జెడ్పీ చైర్మన్‌కు స్వామివారి చిత్రపటం ఇస్తున్న ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి

కాణిపాకం: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని శనివారం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు సూపరింటెండెంట్ కోదండపాణి స్వాగతం పలికి స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం అందించగా, అధికారులు స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలతో సత్కరించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనవ్యర్థాల నిర్వహణపై కార్మికులకు శిక్షణ


కార్మికులకు శిక్షణ ఇస్తున్న నిపుణులు

చిత్తూరు అర్బన్: వీధుల్లో పోగైన చెత్తాచెదారాన్ని అలాగే ఓచోట పడేయడం వల్ల పర్యావరణానికి తీరని నష్టం చేకూరుతుందని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్ తెలిపారు. కార్మికులు సరైన శిక్షణ తీసుకుని తడి–పొడి చెత్తను వేరు చేయడం వల్ల పర్యావరణంతో పాటు ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. ఆయన శనివారం కమిషనర్ ఆదేశాలతో పారిశుద్ధ్య కార్మికులకు ఘనవ్యర్థాల నిర్వహణ (తడి, పొడి చెత్త నిర్వహణ)పై కార్పొరేషన్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనల ప్రకారం ఘన వ్యర్థాల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలన్నారు. వ్యర్థాలను క్షేత్రస్థాయిలోనే పూర్తిస్థాయిలో వేరుచేయడం ద్వారా నిర్వహణ సులభమవుతుందని చెప్పారు. అనంతరం రిసోర్స్ పర్సన్ మస్తానయ్య పారిశుద్ధ్య కార్మికులకు శిక్షణ ఇచ్చారు. వ్యర్థాలను వేరు చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలు, వేరు చేయకపోవడం వల్ల కలిగే నష్టాలు, అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహ, పర్యావరణ పారిశుద్ధ్య కార్యదర్శులు, మేస్త్రీలు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

ధ్వజారోహణంతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు


సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న పార్వతి పరమేశ్వరులు

యాదమరి: మండల కేంద్రమైన యాదమరిలో వెలసిన ఏకాంబరేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఉదయం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం వేద మంత్రాల మధ్య ధ్వజారోహణం చేసి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ఉదయం పార్వతీపరమేశ్వరులు సూర్యప్రభ వాహనంపై, రాత్రి చంద్ర ప్రభ వాసహంపై ఊరేగిన్నారు. భక్తులు స్వామివారికి కర్పూర మంగళ హారతులు ఇచ్చి పూజలు చేశారు.

చిత్తూరు డివిజన్‌లో 30 యాక్టు అమలు

- కార్యక్రమాల నిర్వహణకు అనుమతి తీసుకోవాల్సిందే
- 2,400 మంది పాత నేరస్తుల బైండోవర్
- చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి


సిబ్బందితో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా చిత్తూరు పోలీసు సబ్–డివిజన్ పరిధిలో ఏవైనా కార్యక్రమాలు నిర్వహించేముందు తప్పనిసరిగా తమ అనుమతి తీసుకోవాలని డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 30–పోలీస్ యాక్ట్‌ను అమలుచేస్తున్నట్లు తెలిపారు. ఆయన శనివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ విశ్వనాథరెడ్డి, ఎస్ఐ షేక్‌షావలితో కలిసి మీడియాతో మాట్లాడారు. డీఎస్పీ మాట్లాడుతూ చిత్తూరు నియోజకవర్గంతో పాటు గంగాధర నెల్లూరు, పెనుమూరు, ఎస్ఆర్.పేట, యాదమరి, తవణంపల్లె, కాణిపాకం, పూతలపట్టు, ఐరాల, కల్లూరు, రొంపిచెర్ల మండలాల్లో ఇప్పటికే 30–పోలీస్ యాక్ట్ అమలులో ఉందన్నారు. ఇది ప్రతీనెలా జరిగే తంతుని, ఈ నెల 12వ తేదీ వరకు ఉన్న 30–పోలీస్ యాక్టును మరో నెల రోజులు పొడిగిస్తున్నట్లు తెలిపారు. డీఎస్పీ అనుమతి లేకుండా బహిరంగ ప్రదేశాల్లో సమావేశాలు, సభలు, ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించడానికి వీల్లేదన్నారు. తాము కొత్తగా ఎలాంటి నిషేధాజ్ఞలు విధించడంలేదన్నారు. పోలీసుల అనుమతి తీసుకుని కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగులు ఎవరికైనా సరే ఇది వర్తిస్తుందన్నారు. ఎన్నికల వేళ పాత నేరస్తులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఎవరైనా దీన్ని ఉల్లంఘిస్తే ఐపీసీ సెక్షన్–188 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామన్నారు. చిత్తూరు పోలీసు సబ్–డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు దాదాపు 2,400 మంది పాత నేరస్తులను బైండోవర్ చేసినట్టు పేర్కొన్నారు. రౌడీషీటర్లు, వివాదాస్పద వ్యక్తులు, గత ఎన్నికల్లో కేసులు నమోదైన వారు, సమస్యలు సృష్టించేవాళ్లను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ముఖ్యంగా గొడవలకు పాల్పడబోమని వారి నుంచి తహసీల్దార్ హామీ తీసుకుంటున్నట్టు వివరించారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు.

రెండు చుక్కలతో నిండు జీవితం



ర్యాలీలో మాట్లాడుతున్న మేయర్ అముద, బంగారుపాళెం: పల్స్‌పోలియోపై ర్యాలీ చేస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది




ఐరాల: ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, యాదమరి: పల్స్ పోలియో ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న వైద్యాధికారి, కె.గొల్లపల్లెలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, టీచర్లు


బంగారుపాళెంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

చిత్తూరు రూరల్: రెండు చుక్కలతో పోలియోను నివారిద్దామని మేయర్ అముద తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు శనివారం చిత్తూరు నగరంలో పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు సాగింది. అక్కడ ప్రతిజ్ఞ చేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోలియో కట్టడికి చర్యలు చేపడుతోందన్నారు. ఇందులో భాగంగా 5 ఏళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని విధిగా చేపడుతోందన్నారు. తద్వారా పోలియో వ్యాధిని నివారించగలమని, అధికారులంతా ప్రభుత్వ ఆశయం మేరకు పనిచేయాలని చెప్పారు. వైద్య సిబ్బంది కూడా నిర్లక్ష్యం వీడి బాధ్యతతో పిల్లలకు రెండు చుక్కలు వేయించాలన్నారు. వంద శాతం లక్ష్యం పూర్తి కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌వో ప్రభావతిదేవి, డీఐవో రవిరాజు, ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, అధికారులు హర్షవర్ధన్, లోకేష్, శిరీష, శ్రీనివాసులు, అనిల్, జార్జ్, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: మండల కేంద్రమైన బంగారుపాళెంలో శనివారం పల్స్‌పోలియో కార్యక్రమంపై ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్ మాట్లాడుతూ 5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఆదివారం తల్లిదండ్రులు తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. మండలంలో 6,316 మంది పిల్లలు ఉన్నట్లు తెలిపారు. పోలియో చుక్కలు వేసేందుకు 49 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పర్యవేక్షణ కోసం ఐదుగురు రూట్ ఆఫీసర్లను, ఒక మొబైల్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తల్లిదండ్రులు పిల్లలను పోలియో కేంద్రాలకు తీసుకువెళ్లి చుక్కలు వేయించాలన్నారు. అదే విధంగా స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు లోకేష్, రమేష్, ఎంపీహెచ్‌ఈవో రమేష్‌బాబు, హెచ్ఎం ధనుంజయరాజు, గ్రామ కార్యదర్శి శంకరయ్య, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఐరాలలో..

ఐరాల: పోలియో రహిత దేశమే లక్ష్యంగా ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం చేపడుతున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆయన మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కల మందు వేయించాలని సూచించారు. అనంతరం ఆయన పల్స్ పోలియో పోస్టర్లను ఆవిష్కరించారు. పల్స్ పోలియోపై ప్రజల్లో చైతన్యం తేవడానికి పీహెచ్‌సీ నుంచి బజారువీధి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పూర్ణలత, సీహెచ్‌వో సుగుణవతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యాదమరిలో..

యాదమరి: పల్స్ పోలియోపై కె.గొల్లపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం లలిత మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కనకాచారి, భాస్కర్ రెడ్డి, సుల్తాన్, చిట్టిబాబు పాల్గొన్నారు. పల్స్ పోలియోను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సంతగేటు ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ కోరారు. ఆయన శనివారం పల్స్ పోలియో ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో లక్ష్మీనారాయణ, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: రెండు చుక్కలతో పిల్లలకు నిండు జీవితాన్ని ఇవ్వొచ్చని మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మండలంలో 5 ఏళ్లలోపు పిల్లలు 5,500 మంది ఉన్నారని, వారికి పోలియో చుక్కలు వేయడానికి 40 బూత్‌లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. 200 మందిని నియమించామన్నారు.

105 మందికి వైద్య పరీక్షలు


పైమాఘంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు


ఐరాలలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ పూర్ణలత

తవణంపల్లె: మండలంలోని పైమాఘం, టి.పుత్తూరులో నిర్వహించిన వైద్య శిబిరంలో 105 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. పైమాఘంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టర్ మోహన్‌వేలు, టి.పుత్తూరులో డాక్టర్ పవన్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 104 మొబైల్ క్లినిక్‌లో గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఉచి తంగా మందులు అందజేశారు. వైద్య బృందం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కట్టకిందపల్లెలో వైద్య శిబిరం

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం కింద ప్రజలకు ఇంటి వద్దే వైద్య సేవలు అందిస్తున్నట్టు స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ సంధ్య తెలిపారు. ఆమె శనివారం కట్టకిందపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు రక్త పరీక్షలు చేశారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది చంద్రశేఖర్, రోస్‌లిన్, నిత్య, పంకజం పాల్గొన్నారు.

ప్రజల ఇంటి ముంగిటకే వైద్యం

ఐరాల: గ్రామీణ ప్రాంత ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటి ముంగిటకే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత తెలిపారు. ఆమె శనివారం పేరయ్యగారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 80 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బాలికల చదువును ప్రోత్సహించాలి


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ నాగశైలజ

చిత్తూరు కలెక్టరేట్: తల్లిదండ్రులు బాలికల చదువును ప్రోత్సహించాలని ఐసీడీఎస్ పీడీ నాగశైలజ తెలిపారు. జిల్లా కేంద్రమైన చిత్తూరులోని మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మైనారిటీ బాలికలకు కెరీర్ గైడెన్స్ తదితర అంశాలపై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న పీడీ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో విద్యనభ్యసించాలని తెలిపారు. క్రమశిక్షణతో మెలగాలని, ఆకర్షణకు లోనుకాకూడదని వెల్లడించారు. తమకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. పదవ తరగతి పూర్తి కాగానే పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని తెలిపారు. జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి చిన్నారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక చర్యలు చేపడుతోందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పదవ తరగతి తర్వాత చదవాల్సిన కోర్సులు, వాటి ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఈ వర్క్‌షాప్‌లో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఆంజనేయరాజు, విద్యార్థినులు పాల్గొన్నారు.